జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



శనివారం | 22-11-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 518 పేజీలు: 4 వెల : రూ.7


# టెక్ శంకర్.. అమర్ రహే



*** బాతుపురంలో మావోయిస్టు నేత జోగారావు అంత్యక్రియలు * నివాళులు అర్పించిన విప్లవ సంఘాలు, ఉద్దానవాసులు, కుటుంబీకులు * అడుగడుగునా పోలీసు ఆంక్షలు * పోలీసులు, బంధుమిత్రుల కమిటీ సభ్యుల మధ్య వాగ్వాదం**

పలాస, నవంబరు21 (వార్త): టెక్ శంకర్.. అమర్ రహే నినాదాలతో వజ్రపుకొత్తూరు మండలం బాతుపురంలో విప్లవ నినాదాలు హోరెత్తాయి. జోగారావు మృతదేహాన్ని చూసేందుకు పెద్ద ఎత్తున ఉద్దానవాసులు తరలివచ్చారు. పోలీసుల ఆంక్షల నడుమ మావోయిస్టు నేత మెట్టూరు జోగారావుకు కుటుంబీకులు, విప్లవ సంఘాలు, అమరుల బంధుమిత్రుల కమిటీ, ప్రజా కళాకారులు, ఉద్దానం ప్రజలు అంత్యక్రియలు నిర్వహించారు. గురువారం రాత్రి జోగారావు మృతదేహాన్ని బంధువులకు పోలీసులు అప్పగించగా, శుక్రవారం ఉదయం అంబులెన్స్‌లో బాతుపురం తీసుకువచ్చారు. అరుణోదయ కళాకారుల బృందం పలు విప్లవగీతాలను ఆలపించి నివాళులు అర్పించారు. జోగారావు మృతదేహం ఊరేగింపుగా తీసుకువెళ్లేందుకు విప్లవసంఘాలు సిద్ధం కాగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో బంధుమిత్రుల కమిటీ సభ్యులు రోడ్డుపైనే బైఠాయించారు. కుటుంబ సభ్యుల విన్నపం మేరకు జోగారావు మృతదేహాన్ని ప్రత్యేక రథంపై బాతుపురంలోని శ్మశానవాటికకు తరలించారు. జోగారావు మృతదేహానికి సోదరుడు మధుసూధన్ నిప్పంటించి అంత్యక్రియలు పూర్తిచేశారు. బాతుపురంలో పోలీసులు అడుగడుగునా నిఘా ఏర్పాటు చేశారు. జోగారావు అంత్యక్రియలు పూర్తయ్యే వరకూ గ్రామంలోనే మకాం వేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర అమరుల బంధుమిత్రుల కమిటీ అధ్యక్షురాలు అంజమ్మ మాట్లాడుతూ హిడ్మా, శంకర్ పాశవిక ఎన్‌కౌంటర్లు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జిల్లా అధ్యక్షుడు జోగి కోదండరావు మాట్లాడుతూ పోలీసుల అదుపులోఉన్న మావోయిస్టులను కోర్టుకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరిగినవన్నీ బూటకపు ఎన్‌కౌంటర్లని, దీన్ని ప్రజలు ఖండించాలన్నారు.





# స్క్రబ్ టైఫస్.. కలకలం

*** మండలంలో ప్రబలుతున్న వింత జ్వరాలు**
*** ముగ్గురికి సోకిన స్క్రబ్ టైఫస్**



**హిరమండలం, నవం బరు 21 (వార్త):** గత కొన్ని నెలలుగా వీడని జ్వరం.. విపరీతమైన తలనొప్పి.. ఒళ్లు నొప్పులతో హిరమండలం మండల ప్రజలు బాధపడు తున్నారు. ఇంజక్షన్లు వేసు కున్నా.. మాత్రలు తీసుకున్నా తగ్గడం లేదు. ఇది స్క్రబ్ టైఫస్ జ్వరం లక్షణాలని వైద్యులు గుర్తించారు. శుక్రవారం హిరమండలం మండలంలో అక్కరా పల్లి, అంబావల్లి, హిరమండలం గ్రామాలకు చెందిన చిన్నారితో పాటు మరో ఇద్దరకు గత నెల రోజులుగా తీవ్రమైన జ్వరం కావటంతో పలు చోట్ల చికిత్స పొందినా, జ్వరం తగ్గకపోవటంతో సుభలాయ్ పునరావాస కాలనీ సూర్యభగవాన్ ప్రైవేటు ఆసుపత్రిలో చేరి వైద్య పరీక్షలు నిర్వహించటంతో స్క్రబ్ టైపస్ జర్వమని తేలింది. దీంతో వారంతా సంబంధిత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ తరహా జ్వరాల బారిన పడిన రోగులు గత రెండేళ్ల నుంచి సుమారు 400 కేసుల వరకు నమోదయ్యాయని సంబంధిత వైద్యాధికారి తెలిపారు. సాధారణ జ్వరంలా కనిపించే స్క్రబ్ టైఫస్‌ను సకాలంలో గుర్తించకుంటే ప్రాణాలు సైతం కోల్పోతారని అంటున్నారు. దట్టమైన చెట్లు, వ్యవసాయ భూములు పక్కన నివసించే వారికి ఎక్కువగా స్క్రబ్ టైఫస్ వ్యాధి సోకుతుంది. చెట్లు, పొలాల్లో ఉండే "త్సుట్సుగామూషి" అనే కీటకం కుట్టడం ద్వారా జ్వరం వస్తుంది. ఈ కీటకాల్లో కొన్ని తీవ్రమైన ప్రభావం చూపుతాయి. కొందరికి వారం రోజుల వ్యవధిలో వ్యాధి సోకుతుందని, మరి కొందరిలో కొన్ని గంటల వ్యవధిలోనే తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్యులు చెబుతున్నారు. త్సుట్సుగామూషి కీటకం కుట్టిన వారిలో జ్వరం అకస్మాత్తుగా రావడం, తీవ్రమైన తలనొప్పి, చలి, కండరాల నొప్పి, దగ్గు వంటి లక్షణాలు ఉంటాయి. కళ్లు తిరగటం, మగత,వాంతులు కూడా అవుతుంటాయి. ఇలాంటి వారి శరీరంపై పరిశీలిస్తే కీటకం కుట్టిన ప్రాంతంలో నల్లటి మచ్చ కనిపిస్తుంది. ఈ వ్యాధిని నిర్ధారించేందుకు ఎలిసా పరీక్షలు సైతం చేయాల్సి ఉంది. మధుమేహం, అధిక రక్తపోటు ఉన్నవారికి సోకితే ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది.అంతే కాకుండా హెచ్ఐవీ రోగులకు సోకితే ప్రాణాంతకమే. చిన్న పిల్లలు,వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి స్క్రబ్ టైఫస్ సోకినట్లయితే ప్రమాదకరంగా మారుతుంది.

## స్క్రబ్‌టైపస్ కేసులను అశ్రద్ధ చేయొద్దు

స్క్రబ్ టైఫస్ వ్యాధికి గురైన వారు గత రెండేళ్లుగా ఆసుపత్రిలో చికిత్స పొందారు. గత రెండు సంవత్సరాలుగా సుమారు 400 కేసులు నమోదయ్యాయి. జ్వరం తగ్గకపోవటంతో వారిని ఎలిసా పరీక్షలు నిర్వహించిన అనంతరం సంబంధిత స్క్రబ్ టైపస్ వ్యాధికి సంబంధించిన చికిత్స అందజేయటం జరుగుతుంది. ఎలిసా పరీక్షలు కూడా అందుబాటులోనే ఉంది. స్క్రబ్ టైపస్ వచ్చిన వారికి కచ్చితమైన యాంటీబయోటిక్ ఇవ్వడం ద్వారా నివారించవచ్చు. వ్యాధిని అశ్రద్ధ చేస్తే ఊపిరితిత్తులు, ఇతర అవయవాలపై ప్రభావం చూపి,ఒక్కోసారి ప్రాణాంతకంగా కూడా మారవచ్చు.ఈ వ్యాధి వచ్చిన వారి శరీరంపై నల్లటి మచ్చలు ఉండటాన్ని గుర్తించవచ్చు..చిన్నపిల్లల విషయంలో మరింత జాగ్రత్తలు పాటించాలి.

**- డా.సొండి రాకేష్ కుమార్, పీడియాట్రిక్, నియోనాటోలోజిస్ట్**

# హత్య కేసుగా నమోదు

**సంతబొమ్మాళి, నవంబరు 21 (వార్త):** నౌపడలో గుర్తు తెలియని వివాహిత మృతిపై హత్య కేసుగా నమోదు చేసినట్లు నౌపడ ఎస్సై నారాయణస్వామి శుక్రవారం తెలిపారు. అనుమానితుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు. మృతురాలిది టెక్కలి మండలం కొండభీంపురం గ్రామానికి చెందిన దాసరి పుష్పలతగా గుర్తించారు. మృతికి గల కారణాలను తెలుసుకోవడానికి పోలీసులు మృతురాలు భర్త దాసరి బాలకృష్ణ అదుపులోకి తీసుకొని శుక్రవారం విచారణ చేస్తున్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో ఆరు నెలలుగా వేర్వేరుగా ఉంటున్నారు. గ్రామ పెద్దలు సమక్షంలో పలుమార్లు పంచాయతీలు జరిగాయి. ఈ తరుణంలో మృతురాలు పుష్పలతను భర్త బాలకృష్ణ హత్య చేసివుంటాడని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



### సీఎం చంద్రబాబు హయాంలోనే..

# మత్స్యకారులకు స్వర్ణయుగం

*** వారికి 50 ఏళ్లకే పెన్షన్ * ఫిష్ ఆంధ్రా పేరిట గత ప్రభుత్వం దోచేసింది * త్వరలో మూలపేట పోర్టు పూర్తి చేస్తాం * రాష్ట్ర వ్యవసాయ, మత్స్యకార అనుబంధ శాఖల మంత్రి అచ్చెన్నాయుడు * ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం**

**శ్రీకాకుళం, నవంబరు21(వార్త):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాం.. మత్స్యకారులకు స్వర్ణయుగం వంటిదని రాష్ట్ర వ్యవ సాయ, మత్స్యకార దాని అనుబంధ శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. అంబేద్కర్ ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన ప్రపంచ మత్స్యకార దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ఏ ప్రాంతంలోనైనా ఉపాధి కోసం వెళ్లే వారిలో శ్రీకాకుళం మత్స్యకారుడు ఉంటాడన్నారు. వారి తలరాతను మార్చే దిశగా తమ ప్రభుత్వం అన్ని రకాల సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రవేశ పెడుతున్నదని చెప్పారు. మత్స్యకారులకు 50 ఏళ్లకే పెన్షన్ ఇచ్చిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వం 'ఫిష్ ఆంధ్రా' పేరుతో దోపిడీ చేసిందని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను అభినందిస్తూ, తీర ప్రాంతాల్లో రోడ్లు, సౌర వీధి లైట్లు ఆయన కృషి ఫలితమేనని తెలిపారు. మూలపేటలో పోర్టు త్వరలోనే పూర్తి చేస్తామని, త్వరలో రెండు కొత్త హార్బర్లు, కొత్త జెట్టీలు తీసుకువస్తున్నామని మంత్రి ప్రకటించారు. రాబోయే 40-50 ఏళ్లకు సరిపడా మౌలిక వసతులను ముందే ఏర్పాటు చేస్తామని, మత్స్యకారులు పాత పద్ధతులు వదిలి పరిస్థితులకు తగ్గట్టు సాంకేతిక సంస్కరణల వైపు వెళ్లాలని సూచించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ ఆహార భద్రతకు వెన్నెముకగా మత్స్యకారులు నిలుస్తారన్నారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు మాట్లాడుతూ జిల్లాల్లో నిర్మిస్తున్న జెట్టీల ద్వారా వలసలు తగ్గుతాయన్నారు. మత్స్యకార కమిషనర్ రామ్ శంకర్ నాయక్ మాట్లాడుతూ, జెట్టీలు, హార్బర్ల లేమి కారణంగా జిల్లాలో వలసలు ఉన్నాయని తెలిపారు. ఎక్కువ మంది సొంత బోట్లు, వలలు కలిగి ఉంటేనే ఆర్థికవృద్ధి సాధ్యమన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ, జిల్లాలో లక్షా 60 వేల మత్స్యకార కుటుంబాలు ఉన్నాయని, పి ఎం ఎస్ ఎస్ వై కింద దేవునల్తాడ, పీజీ పేట గ్రామాలకు రూ. 2 కోట్ల చొప్పున గ్రాంట్ వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా, చేపల వేటలో మృతి చెందిన 31 మంది మత్స్యకార కుటుంబాలకు మంత్రి చెక్కులను అందించారు. వివిధ పథకాల కింద పలు ఉపకరణాలను కూడా పంపిణీ చేశారు. అంతకు ముందు వేదిక ముందు ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను మంత్రి అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృధ్వీరాజ్ కుమార్, ఆర్డీవో సాయి ప్రత్యూష, పలు మత్స్యకార సొసైటీలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## కోలుకుంటున్న చిన్నారులు

**మందస, నవంబరు 21(వార్త):** అభం, శుభం తెలియని ఆ చిన్నారులు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. వైద్యులే అపర దేవుళ్లుగా పసి పిల్లల ప్రాణాలను కాపాడారు. దీంతో ఆయా గిరిజన కుటుంబాలు ఊపిరిపీల్చుకుంటున్నాయి. మందస మండలంలోని సాబకోట పంచాయతీలో గల బిత్తర బంద గ్రామానికి చెందిన సవర విక్రం (3), ఒడిశా రాష్ట్రానికి చెందిన జన్ని గంగాధర్(4)అనే ఇద్దరు చిన్నారులు గ్రామంలో ఆడుకుంటూ.. ఉమ్మెత్త కాయలు పొరపాటున తినేశారు. దీంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. తల్లిదండ్రులు విషయం తెలుసుకుని, ద్విచక్రవాహనాలపై హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో టెక్కలి, అక్కడ నుంచి రాగోలులోని జెమ్స్ ఆసుపత్రికి తరలించారు. చిన్నారుల పరిస్థితి పరీక్షించిన వైద్యులు సరైన వైద్యం అందివ్వడంతో కోలుకుంటున్నారు. సంఘటన జరిగి 24గంటలు దాటడంతో ప్రాణాపాయం తప్పిందని భావిస్తున్నారు. తీవ్ర అస్వస్థత నుంచి చిన్నారులిద్దరూ కోలుకుంటుండడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అర్చన



**జలుమూరు, నవంబరు 21(వార్త):** అల్లాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన ఈ రోజు అధికారికంగా ప్రారంభించారు. రైతులకు సకాలంలో న్యాయమైన కనీస మద్దతు ధర లభించేలా, కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన బగ్గు అర్చన ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించేందుకు చేపడుతున్న పలు సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రైతుల సమస్యలను ప్రత్యక్షంగా గుర్తించి పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్, స్థానిక సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యమే థీం-5



**మందస, నవంబరు 21(వార్త):** స్థానిక సుస్థిర అభివృద్ధి థీం-5 లక్ష్యమని, గ్రీన్ అంబాసిడర్ లు, గ్రీన్ గార్డ్ ల సామర్థ్యాల పెంపుకై శిక్షణ ఇవ్వడం జరుగుతోందని మందస ఎంపీడీఓ వై.వెంకట రమణ అన్నారు. మందస మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెత్తతో సంపద, గ్రామాల పరిశుభ్రత, తద్వారా పర్యావరణ స్థిరత్వాన్ని గ్రామీణ స్థాయిలో బలోపేతం చెయ్యడమే లక్ష్యంగా స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యం థీం-5 ఉద్దేశ్యమని చెప్పారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను గ్రామ స్థాయిలో కార్యరూపం లోకి తీసుకువచ్చే క్రమంలో పంచాయతీ రాజ్ వ్యవస్థలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, కమ్యూనిటీ ఆధారిత సంస్థలు, గ్రామీణ నేపథ్యంలో అవసరమైన నైపుణ్యం, అదించడం ద్వారా సామాజిక పరివర్తన కై కృషి చేస్తుందన్నారు. దీమ్-5లో భాగంగా పరిశుభ్రత, పచ్చదనం కలిగిన గ్రామ పంచాయతీ సాధించడంలో, విజన్ 2047 లక్ష్యలతో అనుసందానం చేయాలన్న లక్ష్యంతో శిక్షణ జరుగుతుందన్నారు. అంతకు మందు మందస పంచాయతీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ తిరుమలకుమార్, డీపీఆర్సీ ఆనందరావు, పంచాయతీ కార్యదర్శులు, ఎంఆర్ సి శ్రీనివాసరావు, గ్రీన్ అంబాసిడర్ లు, గ్రీన్ గార్డ్ లు పాల్గొన్నారు.

## గురుకులాన్ని సందర్శించిన డైరెక్టర్ పీఎంజే



**మందస, నవంబరు 21(వార్త):** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాన్ని రాష్ట్ర విద్యాసంక్షేమ మౌలిక వసతుల డైరెక్టర్ పీఎంజే బాబు సందర్శించారు. పాఠశాల పనితీరు, విద్యార్థినిల హాజరు, బోధనా ప్రమాణాలు, వసతి గృహాలు స్థితిగతులను పరిశీలించారు. విద్యాలయంలో జరుగుతున్న విద్యా కార్యక్రమాలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ వై.యశోదలక్ష్మి, గురుకులం ప్రిన్సిపల్ ఎల్.లక్ష్మి ఉన్నారు.

## బెల్లుపడలో ఆత్మ సౌజన్యం




**ఇచ్ఛాపురం, నవంబరు 21 (వార్త):** బెల్లుపడలో ఆత్మ సౌజన్యం కార్యక్రమం కింద రైతులకు అవగాహన సదస్సు, శిక్షణా కార్యక్రమం మరియు ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. చిన్న, సన్న రైతులకు అధిక దిగుబడుల కోసం కొత్త వరివంగడాల ప్రచారం పై నిపుణులు వివరణాత్మక సూచనలు అందించారు. ఈ సందర్భంగా రైతుల పొలాల్లో కొత్త వరివంగడాల గిన్ని వెంకట రమణ పొలంలో పనితీరు పరీక్షలు కూడా నిర్వహించారు. పంట పెరుగుదల, వంగడాల అనుకూలత, తెగుళ్ల నిరోధకత, నీటి వినియోగ సామర్థ్యం, దిగుబడి సాధికారత వంటి అంశాలను పరిశీలించి రైతులకు వివరించారు. మట్టినిల్వ కార్డుఆధారంగా భూమి పోషకాల స్థాయి, లోపాల నిర్ధారణ, తగిన ఎరువుల వినియోగం గురించి ఆ రైతులకు శిక్షణ ఇవ్వబడింది. ఈ కార్యక్రమంలో రైతుల కుమట్టి ఆరోగ్య కార్డులు పంపిణీ చేశారు. భూమి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఎరువుల సమతుల్య వినియోగం అవసరాన్ని రైతులకు వివరించారు. ఫీల్డ్ విజిట్ సందర్భంగా పొలాల్లో పంట స్థితి, నీటి నిర్వహణ, పురుగు-వ్యాధుల నియంత్రణ పై ప్రత్యక్ష పరిశీలన చేశారు. రైతుల సమస్యలు సేకరించి తగిన సాంకేతిక సూచనలు అందించారు. ఆత్మ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం రైతుల్లో సాంకేతిక అవగాహన పెంపొందించడంలో దోహదపడింది. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అజయ్‌కుమార్, మల్లేశ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



**మందస, నవంబరు 21(వార్త):** ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు ఏపీ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం నాయకులు అన్నారు. ఏపీ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో పలు పాఠశాలలు సందర్శించి, ఉపాధ్యాయులు, పాఠశాలల సమస్యలను సేకరించారు. అనంతరం ఉపాధ్యాయులచే సభ్యత్వం ద్వారా గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘంలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏపీటీడబ్ల్యూఏ జిల్లా ప్రదానకార్యదర్శి ఎస్.జయరాం, జిల్లా ఉపాధ్యాక్షుడు ఎస్.రామారావు, జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పాత కొజ్జిరియా వద్ద రైల్వేస్టేషన్‌కి ప్రతిపాదనలు

**ఇచ్ఛాపురం, నవంబరు 21(వార్త):** పాత కొజ్జిరియా వద్ద కొత్త రైల్వే స్టేషన్, పాసింజర్ హాల్టులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కొజ్జిరియా (గుడ్డి భద్ర) వద్ద ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు కొత్త స్టేషన్ పాసింజర్ హాల్టులు. ప్లాట్ ఫారంలు నిర్మించడానికి ఖుర్దా డివిజన్ కమర్షియల్ ఇన్స్పెక్టర్ అజయ్ కుమార్. జెఈ మహంతి పరిశీలించారు. ఈ ప్రాంతానికి ఒరిస్సా, ఆంధ్ర సరిహద్దు గ్రామాలకు రైలు సౌకర్యం కోసం చీకటి ఎమ్మెల్యే మనోరంజన్ ధ్యాన సామంతరాయ్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ల సిఫార్సుల మేరకు ప్రతిపాదనలు తయారుచేసి ఇక్కడ ప్రజల, ప్రయాణికుల డిమాండ్ రైల్వే బోర్డుకి మంజూరు గూర్చి ప్రతిపాదనలు పంపుతారని జడ్‌ఆర్‌యుసిసి సభ్యులు శ్రీనివాస్ రౌలో తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పాడ నేలవేణి పద్మనాభం కూటమి నాయకులు పాల్గొన్నారు.



# కార్గో ఎయిర్‌పోర్ట్‌ను వెంటనే రద్దు చేయాలి

**-పోలీసులు నిర్బంధంతో ఆర్డీఓకు వినతిని ఇవ్వలేకపోయాం**

**-26వరకు బ్యాడ్జీలతో ప్రభుత్వంపై నిరసన**

**-ప్రజా పోరాటంపై తప్పుడు ప్రచారం చేస్తే సహించం**

**-కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక కమిటీ హెచ్చరిక**




**మందస, నవంబరు 21(వార్త):** ఉద్దానంలో విధ్వంసకర కార్గో ఎయిర్ పోర్ట్ నిర్ణయాన్ని వెంటనే రద్దు చెయ్యాలని కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. మందస మండలంలోని రాంపురం గ్రామంలో కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక కమిటీ అధ్యక్షుడు కొమర వాసు ఆధ్వర్యంలో బాధిత రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు.



ఈ సందర్భంగా కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక కమిటీ నాయకులు, బాధిత రైతులు మాట్లాడుతూ ఈ నెల 18న బాధిత రైతులంతా కలిసి పలాస ఆర్.డి.ఓ కార్యాలయం దగ్గర మహాధర్నా చేసి ఆర్.డి.ఓ వెంకటేష్ కు పచ్చని ఉద్దానం ప్రాంతంలో కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణం వద్దని వినతిపత్రం ఇస్తామంటే, పోలీసులు నిర్బంధం విధించి, రైతులకు కలిసే అవకాశం ఇవ్వలేదన్నారు. దీంతో ఈరోజు నుంచి ఈ నెల 26వ వరకు నల్ల బ్యాడ్జీలతో ప్రభుత్వంపై నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా జాతిపిత గాంధీజీ భావజాలంతో ప్రజా శాంతియుతంగా పోరాటం చేస్తున్న సరే మా మనోభావాలు దెబ్బతినేలా చేస్తున్నారన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గత సంవత్సరం కాలం నుంచి కార్గో ఎయిర్ పోర్ట్ కమిటీలో కీలకమైన సభ్యుడు, మా బాధిత కుటుంబానికి చెందిన బత్తిని లక్ష్మణ్ పై మా భూములకి సంబంధం లేని కొందరు వ్యక్తులు అన్యాయంగా బైండ్ ఓవర్ కేస్ పెట్టించి, సోషల్ మీడియా వేదికగా బెదిరింపులు చేస్తూ దుర్భాషాలాడడాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. బాధిత రైతులు చేస్తున్న ప్రజా పోరాటంపై కూడా తప్పుడు ప్రచారం చేస్తే సహించబోమని హెచ్చరించారు. రాజకీయ పార్టీలకి అతీతంగా గత సంవత్సరం కాలం నుంచి రాజ్యాంగ బద్ధంగా చేస్తున్న ఈ ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వంకి తెలియజేస్తున్నామన్నారు.

### నేటి సమావేశానికి హాజరు కాలేం..

ఉద్దానంలోని సుమారు 20గ్రామాలకు సంబంధించిన రైతులు ఈ నెల 22న పలాస ఆర్డీఓ కార్యాలయంలో జరిగే సమావేశానికి హాజరు కావాలని వీఆర్వో ద్వారా కమిటీకి సమాచారం అందిందని కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక కమిటీ నాయకులు చెప్పారు. ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోతున్నామని, ఈ విషయాన్ని వీఆర్వో ద్వారా ఆర్డీఓకు లిఖితపూర్వకంగా తెలియజేయడం జరిగిందన్నారు. రైతులందరికీ రవాణా సౌకర్యం అందుబాటులో లేకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని, మా బాధిత 20 గ్రామాలకు సంబంధించిన బాధిత రైతులు తో ఒక సమావేశం ఏర్పాటు చేయాలని, అందుకు తమకు అనుకూలమైన ఒక తేదీని ఖరారు చేస్తే, ఆ సమావేశానికి హాజరు కావడానికి మేము సంసిద్ధులమని కూడా విన్నవించామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పొట్టి ధర్మారావు, కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక కమిటీ ప్రధాన కార్యదర్శి జోగి అప్పారావు, డా.వై.యస్.ఆర్. ఉద్యాన యూనివర్సిటీ బోర్డ్ మాజీ మెంబర్ బత్తిని లక్ష్మణ్, దున్న హరికృష్ణ, జుత్తు భూపతి, నల్ల పరుశురాం, దాసరి మోహన్, రత్నాల భీమరావు, చిత్త గున్నయ్య, దున్న రామారావు, పొట్టి ఎర్రయ్య, తెప్పల గున్నయ్య, గుంటు లోకనాధం తదితరులతో కలిసి మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## శారీరక, మానసిక, దారుఢ్యానికి క్రీడలు దోహదం

**- ఎమ్మెల్యే శిరీష -సొండిపూడిలో వైభవంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ టోర్నమెంట్**





**మందస, నవంబరు 21(వార్త):** శారీరక, మానసిక, దారుఢ్య వికాసానికి క్రీడలు దోహదపడతాయని పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష అన్నారు. పలాస నియోజకవర్గంలోని మందస మండలంలో సొండిపూడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 37వ రాష్ట్రస్థాయి బాల బాలికల అండర్-14 టెన్నికాయిట్ టోర్నమెంట్ ను ఆమె ప్రారంభిచారు. ముఖ్యఅతిథిగా పాల్గొని, క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించిన అనంతరం శిరీషా మాట్లాడుతూ 37వ టెన్నికాయిట్ ఆటల టోర్నమెంట్ పలాస నియోజకవర్గంలో జరగడం ఆనందదాయకమైన విషయమన్నారు. 19జిల్లాల నుంచి పాల్గొన్న విద్యార్థుల శారీరక, మానసిక, దారుఢ్య వికాసానికి ఈ పోటీలు ఎంతో గానో ఉపయోగపడతాయన్నారు. శ్రీకాకుళం జిల్లా నుండి వెయిట్ లిఫ్టింగ్ కరణంమల్లేశ్వరి, బాక్సింగ్ మేరీకోమ్, విశాఖపట్నం నుండి సెలక్ట్ అయిన క్రికెట్ క్రీడాకారులు మీ అందరికీ స్ఫూర్తి కావాలని, ఈ ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఎక్కువ నిధులు కేటాయిస్తూ ఉద్యోగంలో కూడా 3శాతం రిజర్వేషన్ కల్పించడమనేది అనేది గొప్ప విషయంగా అభివర్ణిస్తూ, ఈ క్రీడలలో పాల్గొన్నటువంటి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టెన్నికాయిట్ కార్యదర్శులు సత్యనారాయణ, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్, ఎంఈఓ, హెచ్ఎం, టీడీపీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, తాతారావు, పీరకట్ల విఠల్, లబ్బరుద్రయ్య, తమరియా భాస్కర్, ముంజేటి చంద్రశేఖర్, ఔగాన ఈశ్వర్, ఇతర మండల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దాలి

**-డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వనజ**




**మందస, నవంబరు 21(వార్త):** ప్రజలను చైతన్యవంతులుగా జాతీయ సేవా పథకం వాలంటీర్లు తీర్చిదిద్దాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ దంతులూరి వనజ పిలుపునిచ్చారు. మందస మండలంలోని బాలిగాం ఆదిత్య డిగ్రీ, జూనియర్ కళాశాలల ఆధ్వర్యంలో ఉమాగిరి, పితాతొళికాలనీ గ్రామాల్లో నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం ప్రత్యేక సేవా శిబిరంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ దంతులూరి వనజ పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి, విద్యార్థులకు జాతీయ సేవా పథకం ఆవశ్యకతను యువత ఈ మంచి కార్యక్రమం ద్వారా ఒక గ్రామంలో ఉన్నటువంటి ప్రజలకు చైతన్యవంతులుగా తీర్చిదిద్దాలన్నారు. దేశానికి యువత వెన్నెముకని మన జిల్లాలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సుమారుగా 8,000మంది వాలంటీర్లు ఉన్నారని, అందరూ తలుచుకుంటే సమాజాన్ని, మన జిల్లాను చైతన్యవంతం చేసి మార్గదర్శకులుగా నిలుస్తారన్నారు. ప్రత్యేక సేవా పథకం విధి నిర్వహణ పీఓలతో మాట్లాడారు. అనంతరం వలంటీర్లు ఉమాగిరిలో శ్రీరాజరాజేశ్వరి గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ప్రజలు గ్యాస్ ప్రమాదాలు జరగకుండా ఏ విధంగా అప్రమత్తంగా ఉండాలనేది వాలంటీర్లకు వివరించారు. పితాతొళికాలనీ గ్రామ పరిసరాల్లో ప్రకృతి వ్యవసాయంపై విశ్వనాథం, బీఎస్ పురం అగ్రికల్చర్ సహాయకుడు వ్యాస్ వలంటీర్లతో మాట్లాడి ప్రకృతి వ్యవసాయం వలన కలిగే లాభాలు, రసాయనిక ఎరువుల వలన కలిగే నష్టాలు వివరించారు. రసాయినాలతో వచ్చే రకరకాల దీర్ఘకాలిక రోగాలు పంటలను వచ్చే దిగుబడి తదితర అంశాలపై విద్యార్థులకు, గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో పీఓలు కృష్ణారావు, మన్మధరావు, రవిశంకర్, ప్రిన్సిపల్ ప్రవీణ్, ప్రసాద్, మోహనరావు, వాలంటీర్లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యలపై వినతులపై చర్యలకు హామీ



**నరసన్నపేట, నవంబరు 21(వార్త):** నరసన్నపేట నియోజకవర్గంలో రెవెన్యూ విభాగానికి సంబంధించి నెలలుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న పలు ప్రజా సమస్యలు, ఫిర్యాదులు, పెండింగ్ సేవా అంశాలను ఈ రోజు సూడా చైర్మన్ కొరికాన రవి కుమార్ కి అధికారికంగా అందజేశారు. జనసేన పార్టీ నరసన్నపేట ఇన్‌చార్జ్ బలగ ప్రవీణ్ కుమార్ రైతుల ప్రతినిధులతో కలిసి చైర్మన్ కార్యాలయంలో ఈ వినతుల పత్రాన్ని సమర్పించారు. రైతుల భూ సమస్యలు, ధృవపత్రాల జారీ ఆలస్యం, సర్వే ప్రక్రియల్లో జాప్యం, వివిధ రెవెన్యూ సేవల్లో ఎదురవుతున్న అవాంతరాలను వివరించుతూ తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. వినతులను స్వీకరించిన చైర్మన్ కొరికాన రవి కుమార్ ప్రజలకు అసౌకర్యం కలగకుండా వేగంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంబంధిత శాఖలతో వెంటనే మాట్లాడి పెండింగ్ సేవలను నిర్దిష్ట గడువులో పూర్తి చేయించేందుకు చర్యలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండదని, రెవెన్యూ సేవలను మరింత పారదర్శకంగా, సులభతరంగా అందించే దిశగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బలగ ప్రవీణ్ కుమార్ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు చురుకుగా వ్యవహరించాలని కోరుతూ, జనసేన పార్టీ ప్రజల తరపున ఇలాంటి అంశాలను నిరంతరం ముందుకు తీసుకెళ్తుందని తెలిపారు.

## 17 వ వార్డు లో యువజన సంఘం ఏర్పాటు



**ఇచ్ఛాపురం, నవంబరు 21(వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ 17వ వార్డులో ఆదిత్య యువజన సంఘ సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఐబి రాము. సీఎంఎం భాస్కర రావు, ఆర్‌పి ప్రమీల, 17 వవార్డు తెలుగుదేశం ఇన్‌చార్జి జన్నెల సంతోష్‌యాదవ్ పాల్గొన్నారు. మెప్మా ఆధ్వర్యంలో యువజన సమాఖ్య ఏర్పాటు చేశారు.

## ఒడిశా యువకుడికి ఆర్థిక సాయం



**ఇచ్ఛాపురం, నవంబరు 21(వార్త):** బెజ్జిపద్ర గ్రామానికి (ఒడిశా)చెందిన దాట్లనవీన్ కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు రెండు కిడ్నీలు దెబ్బ తిన్నాయని వైద్యులు చెప్పడంతో ప్రస్తుతం నవీన్ శ్రీకాకుళం జెమ్స్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. తన శస్త్రచికిత్స కోసం 15 లక్షల ఖర్చవుతాయి. ఆర్థిక పరిస్థితి అంతా అంతా మాత్రమే ఇంకా అధిక మొత్తంలో డబ్బులు అవసరమని తెలుసుకొని ఆ కుటుంబానికి జిఎస్ హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ వారు 5000 రూపాయలను ఆర్థిక సాయం చేశారు.

## మత్స్యకార యువకుడిని ఆదుకోండి



**ఇచ్ఛాపురం, నవంబరు 21(వార్త):** కవిటి మండలం కాపాసుకుద్ది గ్రామానికి చెందిన మత్యకార యువకుడు వంక చంద్రరావు గుజరాత్ లో వేటకు వెళ్లే సందర్భంలో బోట్ లో అగ్నిప్రమాదం జరిగి గాయాలతో ప్రస్తుతం శ్రీకాకుళం నందు తిరుమల హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు, అతనికి అత్యవసర వైద్యం కొరకు సుమారు 6 లక్షలురూపాయల వరకూ అవసరం ఉందనే విషయం డాక్టర్ లు తెలిపారు. సీడప్ మాజీ చైర్మన్ సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి తన వంతుగా కొంత మొత్తం సొమ్ము పంపించారు. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆఫీస్‌లో ఆయన పరిస్థితి తెలియజేశారు. పేషెంట్ వివరాలు పంపించమని చెప్పారని, తదుపరి హాస్పిటల్‌తో చంద్రరావు గురించి మాట్లాడతామని తెలియజేసారని చెప్పారు.

## గ్రీన్ అంబాసిడర్‌లతో క్లీన్ విలేజెస్

**సోంపేట నవంబరు 21(వార్త):** క్లీన్ అండ్ గ్రీన్ విలేజెస్ నిర్మాణంలో గ్రీన్ అంబాసిడర్ల పాత్ర ఎనలేనిదని ఎంపీడీవో ఈశ్వరమ్మ డిప్యూటీ ఎంపీడీవో వెంకట్రావు, స్థానిక మేజర్ పంచాయతీ అభివృద్ధి అధికారి శాంతకుమారి పేర్కొన్నారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన థీమ్ ౧5 ప్రాజెక్ట్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల అభివృద్ధికి అవసరమైన గ్రీన్ అంబాసిడర్ లను అధికారులు బృందాలుగా ఏర్పాటు చేశారు. సోంపేట మేజర్ పంచాయతీ వరకు 16 బృందాలను ఏర్పాటు చేసి వారికి బాధ్యతలను అప్పగించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రీన్ అంబాసిడర్లకు ఒక్కరోజు శిక్షణ ఏర్పాటు చేశారు. పంచాయతీ పరిధిలో గల వీధుల్లో చెత్తను సేకరించడం దాన్ని ఎస్డబ్ల్యుపిసి కేంద్రాలకు తరలించి తడి పొడి చెత్త లను వేరు చేసి వాటి ద్వారా సేంద్రియ ఎరువు తయారు చేసి దాన్ని రైతులకు విక్రయించి ప్రభుత్వానికి ఆదాయం చేయి ప్రభుత్వానికి ఆదాయం చేకూర్చేలా అంకితభావంతో కృషి చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని గుర్తు చేశారు. గ్రామాలను తీర్చిదిద్దేందుకు అంబాసిడర్లతో మాక్ డ్రిల్ నిర్వహించారు. అలాగే కార్మిక చట్టాలు ఆరోగ్య సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఘనంగా జాతీయ సాఫ్ట్‌బాల్ దినోత్సవం

**శ్రీకాకుళం, నవంబరు 21(వార్త):** శ్రీకాకుళం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంలో జాతీయ సాఫ్ట్ బాల్ దినోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్బాల్ అసోసి యేషన్ కార్యదర్శి సూర శ్రీనివాసరావు మాట్లాడుతూ సాఫ్ట్ బాల్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఇందుకోసం తన వంతు సహాయ సహకారాలు అందజేస్తా మన్నారు. మరో అతిథి నెహ్రూ యువక కేంద్రం కోఆర్డినేటర్ వెంకట ఉజ్వల్ మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో సాఫ్ట్ బాల్ వేగంగా అభివృద్ధి చెందు తుందన్నారు. క్రీడాకారుల కోసం త్వరలో సాఫ్ట్ బాల్ క్రీడా పరికరాలను అందజేస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ ఎంవి రమణ మాట్లాడుతూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పీఏసీ చైర్మన్ కూన రవికుమార్ సహకారంతో రాష్ట్రంలో సాఫ్ట్ బాల్ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మెట్ట తిరుపతిరావు, ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ బివి రమణ, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# దేవుడి పేరుతో కాలేజీ ఆక్రమణను వ్యతిరేకిస్తున్నాం

### - చిన్న జీయరుపై మందస గ్రామస్తుల ఆగ్రహం



**మందస, నవంబరు 21(వార్త):** ప్రజల ఆస్తులను దురాక్రమించడానికి చిన్నజీయర్ పంపిన కోర్టు నోటీసులకు వ్యతిరేకంగా మందస గ్రామ పురజనులు, కాలేజీకి ఆనుకొని ఉన్న శివాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. వడ్డి గోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో పలువురు వక్తలు ప్రసంగిస్తూ 1981వ సంవత్సరంలో మందస రాజు వాసుదేవాలయం పక్కన తన ఆధీనంలోనున్న 1.40 సెంట్లు భూమిని కాలేజీ నిర్మాణానికి కేటాయించారన్నారు. గ్రామస్తుల సహకారంతో కాలేజీని ప్రభుత్వం నిర్మించిందని అన్నారు. చిన్న జీయర్ కొంతకాలంగా కళాశాలను దానికి ఆనుకుని ఉన్న గోపాల్ సాగరాన్ని,శివాలయాన్ని, కూరగాయలు పండించుకుంటున్న చిన్న రైతులను, గుడి వెనుక నున్న జిరాయితీ భూములతో సహా సుమారు 200 ఎకరాల భూమిని దురాక్రమించడానికి ప్రజలపై వాజ్యాలు వేస్తూ కోర్టులు చుట్టూ తిప్పడాన్ని వక్తలు ముక్త కంఠంతో ఖండించారు. స్థానిక ప్రజా ప్రతినిధులను ఉపయోగించుకొని ప్రజల ఆస్తులు కొల్లగొట్టాలని ప్రయత్నం చేసినట్టయితే ప్రజా ప్రతిఘటనని ఎదుర్కోవలసి వస్తుందని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. గోపాల్ సాగర్ జలవనరులు వేలాది ఎకరాల భూమికి ఆయుకట్టుగా ఉండి సాగునీరు అందిస్తుందని, అటువంటి ఈ సాగరాన్ని దురాక్రమిస్తే ఎంతోమంది పేద రైతులు సాగునీరందక వీధిన పడడమే కాకుండా రెండు పంటలు పండే ఈ భూములు పడావు భూములుగా మిగిలి పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేద పాఠశాల పేరుతో సంత స్థలాన్ని దురాక్రమించి తమ సొంతానికి వాడుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలను అభివృద్ధి పరచి మందసలో డిగ్రీ కాలేజీ కూడా ఏర్పాటు చేయాలి కానీ ఉన్న కాలేజీని ఆక్రమిస్తామని అనుకుంటే ప్రజా భంగపాటుకు గురికాక తప్పదని హెచ్చరించారు.



అయ్యప్పస్వాములు శివాలయం ఆవరణలోని ఖాళీ స్థలంలో సన్నిధానాన్ని నిర్మించుకుంటే దాని నిర్మాణానికి వాసుదేవ పెరుమాళ్ కు చెందిన వ్యక్తులు అడ్డుకోవడం అన్యాయమన్నారు. ఈ విధంగా చిన్న జీయర్ అయ్యప్ప స్వాములు సన్నిధానాన్ని అడ్డుకోవడంపై దుయ్యబట్టారు. కాలేజీ, గోపాల సాగరం, సంత స్థలంతో పాటు జిరాయితీ భూములకు సంబంధించి కూడా అన్ని రకాల భూ రికార్డులు ఉన్నప్పటికీ చిన్న జీయర్ మొండిగా వ్యవహరిస్తూ ఆక్రమణలకు వక్తలు ఆరోపించారు. మందస జూనియర్ కాలేజీని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్న చిన్న జీయర్ స్వామి చర్యలకు వ్యతిరేకంగా జరిగిన ఈ సమావేశం సందర్భంగా మందస జూనియర్ కాలేజ్, గోపాల్ సాగరంని గిన్ని తిరుపతిరెడ్డి, ఎం.పీ.టీ.సీ కంచి బెహరా, ఆర్.దిలీప్ కుమార్, గణేష్ సాహు, వడ్డీ గోపాల్, ఎం.కోదండరావు, పురుషోత్తం బెహరా, నిరంజన్ బెహరా, ఎర్నాకుల శ్రీను, గయా సంతోష్ కుమార్, సవర పాల్గొణరావు తదితరులు సందర్శించారు.




## పాఠశాలల సమస్యలపై ఎంఈవోకు వినతి



**నరసన్నపేట, నవంబరు 21(వార్త):** నరసన్నపేట మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి బుద్దాల కేశవరావు ఎంఈఓకు వినతి సమర్పించారు. శుక్రవారం వారు నరసన్నపేట ఎంఆర్సీ కార్యాలయంలో ఎంఈఓ ఉప్పాడ శాంతరావును కలిసి సమస్యలను తెలియజేశారు. ఉపాధ్యాయుల డిప్యూటేషన్, బెంచీల సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై చర్యలు తీసుకుంటామని ఎంఈఓ వారికి హామీ ఇచ్చారు.

## విద్యార్థుల సామర్థ్యాల మెరుగునకు కృషి



**జలుమూరు, నవంబరు 21(వార్త):** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపడే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నామని ఎంఈఓలు బమ్మిడి మాధవ రావు, ఎంవీఎస్ ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం జలుమూరు మండలం దోమన పల్లి పాఠశాలను వారు ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులను నేరుగా కలుసుకొని వారి సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ.. ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహించామని తద్వారా సామర్థ్యాలు మెరుగుపరచాలన్నారు.

## గురుకులంలో నిర్మాణాలు సత్వరం పూర్తి చేయాలి



**కంచిలి, నవంబరు 21(వార్త):** కంచిలిలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జిల్లా కలెక్టర్ మంజూరు చేసిన నిధులతో అదనపు వసతి నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఏపీ ఈ డబ్ల్యూ ఐ డి సి డైరెక్టర్ పీఎంజే బాబు ఆదేశించారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ బి శ్రీరాములు, ఏ ఈ సునీల్, గురుకులాల సమన్వయ అధికారిని వై యశోద లక్ష్మి శుక్రవారం కంచిలి గురుకులాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గురుకులం ప్రిన్సిపాల్ పి శ్రీనివాసరావు తో కలిసి అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. గురుకులంలో అర్థాంతరంగా ఆగిపోయిన తరగతి గదుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో జరుగుతున్న వాలీబాల్ కోర్టు, ఎలక్ట్రికల్ ప్లంబింగ్ పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు చక్కని సూచనలు అందించారు.

## విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



**సోంపేట, నవంబరు 21(వార్త):** కొర్లాంలో గల బాపూజీ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం గ్రంథాలయ కమిటీ సభ్యులు స్థానిక పాఠశాల విద్యార్థులకు విలువైన పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విలువైన సూచనలు సలహాలు అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు సుశీల, ఉపాధ్యాయులు, సర్పంచ్ ప్రతినిధి రామ్ బుడ్డి గణపతి, పెద్దింటి చందు, గంగారావు, తారక్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## సుందరమైన పలాసగా తీర్చిదిద్దడమే లక్ష్యం

### -ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు

**పలాస, నవంబరు 21(వార్త):** పలాస మునిసిపాలిటీని అత్యంత సుందరమైన పట్టణంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వం లక్ష్యం అని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నపూర్ణ ఆశ్రమం వీధిలో స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ పనులకు వజ్జ బాబురావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వద్ద బాబురావు మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కోట్లాది రూపాయలు విడుదల చేసిందన్నారు. దీంతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. పేదల సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో అట్టాడ షణ్ముఖ, అంపోలు శ్రీకాంత్, కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి




**పోలాకి, నవంబరు 21(వార్త):** పోలాకిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో దళారులకు ధాన్యం విక్రయించి నష్టపోకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ధాన్యం కొనుగోలులో తేమశాతం, తూకాలను స్థానిక టెక్నికల్ అసిస్టెంట్ సాయంతో సరిచూసుకోవాలని రైతులకు సూచించారు. రైతులు దళారులను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తారని తెలిపారు. ప్రతి రైతుకు కనీస మద్దతు ధర తక్షణమే అందించేలా ఎటువంటి విధాన పరమైన జాప్యాలు లేకుండా చూసుకోవాలని ఎలక్షన్ తో రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ కు వరి ధాన్యం సేకరణకు మొదలుపెట్టిందని తెలిపారు. ఈ సీజన్‌లో 51 లక్షల టన్నుల వరి ధాన్యాన్ని సేకరించాలని రాష్ట్రం ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఈ ప్రక్రియ కోసం ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అంతటా 3,013 రైతు సేవా కేంద్రాలు, 2,061 వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. నాణ్యతా ప్రమాణాల ఆధారంగా పారదర్శకంగా, ఇబ్బంది లేని విధంగా రైతుల నుండి ప్రతి వరి గింజను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. అమ్మకం జరిగిన 48 గంటల్లోపు రైతుల బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు జమ వుతాయని అన్నారు. గన్నీ బ్యాగులు, తేమ పరీక్ష యంత్రాలు, రవాణా సౌకర్యాలతో ఎటువంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, సర్పంచ్లు, ఎంపీటీ సభ్యులు ఇతర ప్రజాప్రతినిధులు, తహశీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ శాఖ అధికారులు కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంచడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యం

**మందస, నవంబరు 21(వార్త):** విద్యార్థులలో సామాజిక బాధ్యతను పెంచడం, సమాజ సేవలో వారి అనుభవాన్ని అందించడం ద్వారా సమాజానికి సేవ చేయడానికి జాతీయ సేవా పథకం సహాయపడుతుందని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.వనజ అన్నారు. మందస మండలంలోని హరిపురం శాతవాహన జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బైరిసారంగపురం గ్రామంలో ఏర్పాటు చేసిన 3వరోజు ప్రత్యేక సేవా శిబిరాన్ని సందర్శించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక మనిషి మరొక మనిషికి సహకరించడం మానవతా లక్షణమని, అదేవిధంగా మనం పదిమందిలో ఉన్నప్పుడు ఆ పదిమందికీ ప్రయోజనం ఉండాలన్నారు. మనవల్ల మరొకరికి మేలు కలగాలని, ఆ విధంగా పరస్పర సహకారంగా, పరోపకారంగా, మంచిగా మెలగటమే సంఘసేవ అన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ పట్నాయక్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు




రోడ్డు నిబంధనలపై, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భమగా విద్యార్థులకు అందిస్తున్న వంటకాలు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ ఎన్.రామకుమార్, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేడీఎస్ ప్రసాద్, హిస్టరీ అధ్యాపకుడు బి.శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

## టిడ్కో గృహాలను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

**పలాస, నవంబరు 21(వార్త):** పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలోని కోసంగిపురం వద్ద నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహాలను టిడ్కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ హరి తో కలిసి పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ ఇ. శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. గృహ సముదాయం లో మౌలిక సదుపాయాలు కల్పనకు రోడ్లు, కాలువలు, వీధిలైట్లు, మంచినీటి సరఫరా మొదలగు విషయంల పై మున్సిపల్ కమిషనర్ టిడ్కో సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించి మౌలిక సదుపాయాలు పూర్తి చేయడానికి తీసుకొనవలసిన చర్యలు గూర్చి చర్చించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఇ. శ్రీనివాసులు, టిడ్కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ హరి, టిడ్కో అసిస్టెంట్ ఇంజనీర్ రమణ, మున్సిపల్ ఆర్ ఐ శ్రీ అమర్, సి ఎల్ టి సి జగన్, సి ఎం ఎం మోహన్, సచివాలయం టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.



## ఉద్యాన పంటలతో అధిక లాభాలు



**నరసన్నపేట, నవంబరు 21(వార్త):** ప్రకృతి వ్యవసాయ సేద్యంలో భాగంగా వారితో పాటు పొలం గట్లపై ఉద్యానవన పంటలు వేయడం వలన రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని మాస్టర్ ట్రైనర్ తోట రమణ తెలిపారు. శుక్రవారం నరసన్నపేట మండలం మాకివలసలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అదనంగా పొలం గట్లపై కొబ్బరి, మునగ, ఆకుకూరలు పట్టించుకోవడం వలన మేలు జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## సంతలక్ష్మీపురంలో వన్ డే ట్రైనింగ్ ప్రోగ్రాం




**పోలాకి, నవంబరు 21(వార్త):** పోలాకి మండలం పరిధిలోని సంతలక్ష్మీపురం చెత్త సంపద కేంద్రంలో థీమ్ 5 పై క్లాప్ మిత్రలకు వన్ డే శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. డిప్యూటీ ఎంపిడిఓ బి. పద్మావతి ఆధ్వర్యంలో ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇంటింటి చెత్త సేకరణ, చెత్తను వేరుచేయడం వంటి వాటిపై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శిలు, క్లాప్ మిత్రలు, షెడ్ మిత్రులు పాల్గొన్నారు.

## మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగపర్చుకోండి

**మందస, నవంబరు 21(వార్త):** జాతీయ సేవా పథకం ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా హరిపురం శాతవాహన జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 23న(ఆదివారం) బైరిసారంగపురం గ్రామంలో నిర్వహించే మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ఏఓ బి.శివ, ఎన్ఎస్ఎస్ పీఓ రామకుమార్ నేపాక్ కోరారు. బీఎస్ పురంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాగోలు జెమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, కంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉచితంగా మందులు కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ఏఓ బి.శివ, ఎన్ఎస్ఎస్ పీఓ రామకుమార్ నేపాక్ కోరారు.

## వైసీపీ నేతల పరామర్శ

**కంచిలి, నవంబరు 21(వార్త):** సామంత రామచంద్రపురం పంచాయతీ మాజీ సర్పంచ్ లాండ జగన్ నాయకులు సతీమణి సుబ్బమ్మ ఇటీవల మృతి చెందారు. ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, వైసీపీ నేతలు వజ్జ మృత్యుంజయం, వైస్ ఎంపీపీ పాలిన కామాక్షి, సర్పంచ్ ప్రతినిధి డొక్కరి బలరాం, దుర్గాసి ధర్మారావు, తదితరులు కలిసి శుక్రవారం మృతుల కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. వారికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కొనపల సురేష్, తలగాన తిరుపతి, పలికల జయరాం, మడ్డు అభి తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**పలాస, నవంబరు 21(వార్త):** అభివృద్ధి పనుల్లో భాగంగా జరుగుతున్న రోడ్ల నిర్మాణాలలో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ ఇ.శ్రీనివాసులు అన్నారు.

పలాస లేబర్ కాలనీ నుండి స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాల మీదుగా రూ.23.00 లక్షల అంచనా విలువతో 15వ ఆర్థిక సంఘము నిధులతో జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులను శుక్రవారం కమిషనర్ ఐ. శ్రీనివాసులు తమ ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించవలసిందిగా సూచించారు. జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు, గుత్తేదారులకు ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్లు శ్రీకర్ కిరణ్ కుమార్, సచివాలయ ఎమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ధరణికోటలో కోటి సంతకాల సేకరణ




**మెళియాపుట్టి, నవంబరు 21(వార్త):** కోటి సంతకాల సేకరణతో ప్రభుత్వ విధి, విధానాలను ఎండగట్టే దిశగా ప్రయత్నాలు చేయాలని భరణికోట గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు అన్నారు. శుక్రవారం ఆ గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. అనవసర హామీలను ఇచ్చి ప్రజలను కూటమి ప్రభుత్వ మోసం చేసిందన్నారు. ప్రజలకు ఇబ్బంది పెట్టడమే ధ్యేయంగా ఓటమి నాయకులు పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజలు పాల్గొన్నారు.

## బమ్మిడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీదిరి



**పలాస, నవంబరు 21(వార్త):** వైయస్సార్ సిపి జిల్లా అధికార ప్రతినిధి, చినంచల ఎంపీటీసీ, ప్రముఖ విద్యావేత్త బమ్మిడి దుర్యోధనరావు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పలాస లోని వైయస్సార్సీపీ కార్యాలయం ప్రగతి భవన్ వద్ద రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు తొలుత బమ్మిడి దుర్యోధనరావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైయస్సార్సీపి ముఖ్య నేతలు, పార్టీ శ్రేణుల నడుమ ఆయన కేక్ కట్ చేశారు. నియోజకవర్గం నలుమూలల నుంచి విచ్చేసిన వైయస్సార్సీపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు బమ్మిడి దుర్యోధనరావుకు సన్మానించారు. పూల మొక్కలు అందించి మిఠాయిలు తినిపించి శాలువాలతో సత్కరించారు ఈ సందర్భంగా రాష్ట్ర మాజీమంత్రి డాక్టర్ అప్పలరాజు మాట్లాడుతూ, వైయస్సార్ సిపి ఆవిర్భావం నుంచి ఎంతో నిబద్ధతతో, క్రమశిక్షణ గల కార్యకర్తగా అంచలంచలుగా నాయకునిగా రూపు దిద్దుకుంటున్న యువ నాయకుడైన బమ్మిడి దుర్యోధనరావు తన సేవా కార్యక్రమాలు ద్వారా అధిష్టానం పెద్దల వద్ద మంచిగుర్తింపును సంపాదించుకున్నారన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నా ఉత్సాహం చెందకుండా తనకు అప్పగించిన ప్రతి బాధ్యతను సక్రమంగా నిర్వహించి శభాష్ అని నిరూపించుకుంటున్నారని డాక్టర్ అప్పలరాజు కొనియాడారు. ఒకపక్క తన వృత్తి ధర్మాన్ని నిర్వర్తించుకుంటూ, మరో పక్క క్షేత్రస్థాయిలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు రాజకీయంగా కూడా పార్టీ కార్యక్రమాలను కూడా సమర్థవంతంగా నిర్వహిస్తున్న బమ్మిడి దుర్యోధనరావు పార్టీ అగ్ర నాయకుల్లో మంచి విశ్వాసాన్ని సంపాదించుకున్నారని ఆయన కొనియాడారు. పార్టీకి సేవలు అందించే బమ్మిడి దుర్యోధన రావు లాంటి యువ నాయకులకు పార్టీలో మంచి భవిష్యత్తు ఉంటుందని, ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని డాక్టర్ అప్పలరాజు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి పలాస పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి, వైసీపీ నేతలు బడగల బాలయ్య, పలాస ఎంపీపీ ప్రతినిధి ఉంగ సాయి కృష్ణ యాదవ్, దువ్వాడ రవి, పినకాన ముకుంద, కుర్రాయి గోపి, మోహన్ రావు, కృష్ణారావు, నవీన్, శంకర్, హరికృష్ణ, సాగర్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కమీషన్ సభ్యుడుగా దళిత విద్యావేత్తకు అవకాశం కల్పించాలి

### ఎచ్చెర్ల నియోజకవర్గ టీడీపీ దళిత నాయకులు డిమాండ్



**రణస్థలం, నవంబరు 21 (వార్త):** ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమీషన్ సభ్యుడిగా దళిత విద్యావేత్తకు అవకాశం కల్పించాలని ఎచ్చెర్ల నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవల ప్రకటించిన సభ్యుల పేర్లలో ఉన్న ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన ముక్కు ఆదినారాయణను తొలగించి ఆయన స్థానం విద్యావంతులకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈమేరకు ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలోని రణస్థలంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎచ్చెర్ల నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు దొంక సవరయ్య, రణస్థలం మండలం ఎస్సీసెల్ అధ్యక్షుడు దుంగ వెంకటరమణ, లింగాల రామకృష్ణ, నిడిగింట్ల రమణ, దువ్వాన సంతోష్, కేత రామకృష్ణ, కుప్పిలి పోలయ్య, గండి సురేష్ తదితరులంతా కలిసి మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసిన ముక్కు ఆదినారాయణకు పదవి ఎలా కట్టబెడతారని ప్రశ్నించారు. క్రమశిక్షణ కలిగిన తెలుగుదేశం పార్టీలో పని చేసి పార్టీకి వ్యతిరేకంగా పత్రికా సమావేశాలు ఏర్పాటు చేసి నాయకులను ప్రభుత్వాన్ని కించపరిచేలా ముక్కు ఆదినారాయణ మాట్లాడిన విషయాన్ని గుర్తు చేసారు. జూలై ఏడో తేదీన తెలుగుదేశం పార్టీ పదవికి ఆదినారాయణ రాజీనామా చేసారని, అటువంటి వ్యక్తికి పదవి ఎలా కట్టబెట్టారో పాలుపోవడం లేదన్నారు. పార్టీపై వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన వ్యక్తికి, విద్యార్హత లేని వారికి ఎస్సీ కమిషన్ సభ్యుడుగా ఎంపిక చేయడం పట్ల ఉత్తరాంధ్రలో ఉన్నటువంటి తెలుగుదేశం పార్టీ దళిత నాయకులు అలాగే తెలుగుదేశం పార్టీ పైన తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. అనేక సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో దళిత నాయకులు విద్యావంతులు మేధావులు ఉన్నటువంటి వ్యక్తులకి కమిషన్ సభ్యుడుగా అవకాశమిస్తే టీడీపీకి, ప్రభుత్వానికి, ఎస్సీ కులానికి మంచి పేరు వస్తుందని తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రభుత్వం స్పందించి ఎస్సీ సభ్యుడిగా ఆదినారాయణను నియమించడంపై పునరాలోచన చేసి, అతడిని తొలగించి ఎస్సీలలో విద్యావంతులైన దళిత సమాజం కోసం కృషి చేసే వ్యక్తికి ఆ పదవిని కట్టబెట్టాలన్నారు.

## మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలుశిక్ష

**శ్రీకాకుళం, నవంబరు21(వార్త):** శ్రీకాకుళం నగరంలోని జబ్బా వీధికి చెందిన వారణాసి ప్రశాంత్ అనే వ్యక్తి గురువారం మద్యం తాగి వాహనం నడుపుతూ ఏడు రోడ్ల జంక్షన్ వద్ద ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డాడు. రెండవ తరగతి మేజిస్ట్రేట్ కె.శివరామకృష్ణ ముందు ప్రశాంత్‌ను పోలీసులు హాజరుపరిచారు. ఆయనకు రెండు రోజులు జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసు స్టేషన్ సీఐ రామారావు మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడిపే వారికి జైలు శిక్ష తప్పదన్నారు.

# అమరవీరుల స్మారక కార్యక్రమం విజయవంతం చేయండి

### -సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ పిలుపు

### -మర్రిపాడు అమరవీరుల స్థూపం వద్ద కరపత్రం ఆవిష్కరణ




**పలాస, నవంబరు 21(వార్త):** మన దేశంలోని అర్ధవలస – అర్ధ భూస్వామ్య వ్యవస్థను రద్దు చేసి, దోపిడీ పీడనలు లేని నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడానికి వేలాదిమంది వీరులు తమ విలువైన ప్రాణాలను త్యాగం చేసి, ప్రజల కోసమే తమ తుది శ్వాస వరకూ విప్లవ పోరాటంలో నిలబడ్డారని , వారు నెలకొల్పిన విప్లవ సాంప్రదాయాలు, విలువలు, త్యాగాలు, నిబద్ధత మనకు విప్లవాదర్శ స్ఫూర్తినందిస్తున్నాయనీ, రక్తసిక్తమైన వారి విప్లవ మార్గంలో పయనించి, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తిచేసే కర్తవ్యాన్ని నిర్వర్తించాల్సిన బాధ్యత మనపై ఉందని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కమిటి సహాయ కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. నవంబర్ 22న వజ్రపు కొత్తూరు మండలం మర్రిపాడులో జరగనున్న అమరవీరుల స్మారక కార్యక్రమానికి సంబంధించిన కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన శుక్రవారం పాల్గొంటూ మాట్లాడారు. భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలలో అమరులైన వీరులందరికీ న్యూ డెమోక్రసీ పార్టీ అరుణారుణ జోహార్లనర్పిస్తోందన్నారు. శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాట కాలంలో అమరత్వం పొందిన పోరాట వీరుల నెత్తుటి స్మృతికి నివాళిగా శ్రీకాకుళం జిల్లా ఉద్యమ నేల ఉద్దానం గణపతి నగర్ లోని అమరవీరుల స్మారక స్థూపం వద్ద కామ్రేడ్ తామాడ గణపతి, కామ్రేడ్ డాక్టర్ చాగంటి భాస్కరరావుల అమరత్వం పొందిన రోజయిన నవంబర్ 22వ తేదీన న్యూ డెమోక్రసీ పార్టీ నిర్వహిస్తున్న శ్రీకాకుళ అమరవీరుల స్మారక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గౌరకల బాలకృష్ణ మాట్లాడుతూ అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థ రద్దు కోసం... సమ సమాజ నిర్మాణం కోసం భారత విప్లవోద్యమ నిర్మాణంలో అసువులు బాసిన అమరవీరులకు జోహార్లను అర్పించడం మనందరి బాధ్యత అన్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జుత్తు వీరాస్వామి మాట్లాడుతూ నక్సల్బరీ, శ్రీకాకుళ, గోదావరిలోయ ప్రతిఘటనా పోరాట అమరవీరులను స్మరిస్తూ నవంబర్ 22న విప్లవ నివాళులను అర్పించడం చారిత్రిక బాధ్యత అని అన్నారు. ఆపరేషన్ కగార్ పేరిట మతోన్మాద ఫాసిస్టు పాలకులు వందలాది వీరులను ఎన్కౌంటర్ పేరుతో హత్య చేశారనీ, వేలాదిమంది ప్రజల్ని హింసించారనీ, పాశవిక పాలకులు తమ కుట్రలతో వల పన్ని 'లొంగు' బాట్లకు తెర తీశారనీ పీడీఎస్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం .వినోద్ కుమార్ అన్నారు. ఈ దుర్మార్గాన్ని , ఈ పాశవిక నిర్బంధాన్ని, ఈ అమానుష హత్యలను వ్యతిరేకిస్తూనే విప్లవ పోరాటం ముందుకు సాగుతూనేవుందని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధి పేరిట విధ్వంసం సృష్టిస్తున్నారని ప్రజల ఆకాంక్షలను పాలకులు నెరవేర్చడం లేదని ఐఎఫ్టియు జిల్లా నాయకురాలు సవలాపురపు కృష్ణవేణి విమర్శించారు. ఉద్యమాల వనంలో సమస్యలు వెంటాడుతున్నాయని, పచ్చని ఉద్దానంలో గ్రీన్ ఫీల్డ్ కార్గో ఎయిర్పోర్ట్ పేరిట విధ్వంసం సృష్టించే ప్రతిపాదతో మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని తీర ప్రాంతంలో కూటమి పాలకులు అలజడిని సృష్టిస్తున్నారని పి ఓ డబ్ల్యు జిల్లా నాయకులు పోతనపల్లి కుసుమ, బి. ఈశ్వరమ్మ అన్నారు. ఈ కార్యక్రమంలో పి వై ఎల్ జిల్లా నాయకులు సార జగన్ , ఐఎఫ్టియు నాయకులు బర్ల గోపి , పలు ప్రజా సంఘాల నాయకులు రాపాక మాధవరావు, జానకమ్మ , స్వర రామారావు, బంగ్లా , వంకల పాపయ్య , కర్రి అప్పారావు, కామేశ్వరరావు, పున్నయ్య , లక్ష్మయ్య, బారికయ్య, తాతారావు తదితరులు పాల్గొన్నారు.



# పరిసరాల పరిశుభ్రత సమష్టి బాధ్యత




**పోలాకి, నవంబరు 21(వార్త):** పరిసరాల పరిశుభ్రత అనేది సమిష్టి బాధ్యతని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర సాధించాలంటే అందరి సహకారం అవసరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దిష్ట లక్ష్యంతో పనిచేస్తున్నాయని గ్రామాలను కూడా క్లీన్ అండ్ గ్రీన్ గా ఉంచేందుకు అంతా కలసి పనిచేయాలన్నారు. పోలాకి మండలం, సంతలక్ష్మిపురం గ్రామంలో నిర్వహించిన క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలు దేశాభివృద్ధికి పట్టుకొమ్మలన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ముందుగా అక్కడి పరిసరాలన్నీ కూడా పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. అనారోగ్య సమస్యలు దరిచేరవన్నారు. పిల్లలు,పెద్దలు అంతా కూడా ఆరోగ్యకర వాతావరణంలో జీవించాలన్నారు. స్వచ్ఛ భారత్ – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల లక్ష్యాలను ప్రజలు అర్థం చేసుకుని తమ గ్రామాలు, వార్డులు పరిశుభ్రంగా ఉండేందుకు ఎవరికి వారుగా తమ వంతు బాధ్యతగా నడుచుకోవాలని అన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు శాలువాతో సన్మానం చేశారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన మరియు కార్పొరేషన్ చైర్మన్,మండల పార్టీ అధ్యక్షులు, పిఎసిఎస్ చైర్మన్, క్లస్టర్, యూనిట్ ఇన్చార్జి లు, అధికారులు, సచివాలయం సిబ్బంది పారిశుద్ధ్య కార్మికులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర వికాసం



**పలాస, నవంబరు 21(వార్త):** పలాసలోని లేబర్ కాలనీ అంగన్ వాడీ-2 కేంద్రంలో కిశోర వికాసంపై శుక్రవారం ఐసిడిఎస్ సూపర్వైజర్లు యూ.లత, పి.గంగమ్మ వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికల సమగ్రాభివృద్ధి కోసం కిశోర వికాసం పథకం ప్రభుత్వం తీసుకొచ్చిందని, 11నుండి 18 ఏళ్ల మధ్య వయస్సు గల బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబనను మెరుగుపరచడమే లక్ష్యమన్నారు. బాలికల సమగ్రాభివృద్ధి కోసం శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ఉంటివి చేయాలన్నారు. ఆత్మరక్షణ శిక్షణ, డిజిటల్ భద్రత, సైబర్క్రైమ్, ఆన్లైన్ వేదికలపై జాగ్రత్తలు చేపట్టడం. మానవ అక్రమ రవాణా, మాదకద్రవ్యాలు వంటి సమస్యలపై సాధారణ అవగాహన పెంచడం. రక్తహీనత, పోషకాహారం తదితర ఆరోగ్య సమస్యలను నివారించడం. బాల్య వివాహాలను అడ్డుకోవడం, 18 ఏళ్ల కంటే ముందు వివాహాలు జరగకుండా చూడటం, విద్యా డ్రాప్ అవుట్‌లను తిరిగి పాఠశాలకు తీసుకురావడం. నైపుణ్యాభివృద్ధి, వృత్తి విద్య, ఉపాధి అవకాశాలను పెంపొందించడం. యోగా, శారీరక వ్యాయామం వంటి ఆరోగ్య ప్రోత్సాహక కార్యక్రమాలను నిర్వహించడమేనని చెప్పారు. ఈ లక్ష్యాలు బాలికల సాధికారత, భవిష్యత్తును మెరుగుపరచేందుకు సముపార్జిత దృష్టిని కలిగి ఉంటాయిని అన్నారు. పథకం ద్వారా ప్రతి బాలిక తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకుని సమగ్రాభివృద్ధి సాధించగలుగుతుందని నమ్మకం వ్యక్తం చేస్తారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బి.జ్యోతి, ఎస్కే బీబీ, సుమతి, పి.కమలమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తత్వశాస్త్ర దినోత్సవం




**శ్రీకాకుళం, నవంబరు21(వార్త):** శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ తత్వశాస్త్ర దినోత్సవాన్ని నిర్వహించారు. తత్వ శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ వానపల్లి వెంకటరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై పోలీనాయుడు పాల్గొని మాట్లాడారు. తత్వశాస్త్రం అన్ని శాస్త్రాలకు తల్లి వంటిదన్నారు. ప్రతి ఒక్కరు తాత్విక జ్ఞానం పెంచుకోవాలని తెలిపారు. డాక్టర్ వెంకటరావు మాట్లాడుతూ యువత నైతిక విలువలు కాపాడుకుంటూ సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ప్రధాన ఉపన్యాస కులు డాక్టర్ పంచకర్ల అప్పలకొండ మాట్లాడుతూ 2025లో ప్రపంచం మెరుపు వేగంతో మారుతోందన్నారు. సాంకేతికత, కృత్రిమ మేధస్సు, వాతావరణ సవాళ్లు, ప్రపంచ సంఘర్షణలు.. ఇలాంటి సమయంలో తత్వశాస్త్రం మరింత ప్రాముఖ్యత సంతరించుకుంటుందనీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐక్యు ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రదీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు

**శ్రీకాకుళం, నవంబరు21(వార్త):** జాబ్ కార్డుల కోసం ధర ఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సుధాకర్ శుక్రవారం తెలిపారు. జిల్లాలో గల అన్ని గ్రామ పంచాయితీలలో ఈ నెల 22వ తేదిన ఒకసారి గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొ న్నారు. దీనికి సంబంధించి ఉపాధి హామీ సిబ్బంది, మండల స్థాయి అధికారులు గ్రామ పంచాయతీలలో గ్రామ సభ ఏర్పాట్లకు అవసరమగు చర్యలు తీసుకోవా లన్నారు. జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీలలో ఉపాధి శ్రామికులు గ్రామ సభలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను నేరు గా అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించుకోవాలని కోరారు. జాబ్ కార్డు కోసం కొత్తగా దరఖాస్తులు వస్తే స్వీకరించి, మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈకేవైసి ప్రాసెస్ కారణంగా డిలీట్ అయిన జాబ్ కార్డులు మళ్ళీ పరిశీలించి అర్హులైతే వెంటనే పునరుద్ధరణకు చర్యలు చేపట్టడం జరుగు తోందన్నారు.

## మోసగించిన మహిళ అరెస్టు

**శ్రీకాకుళం, నవంబరు21(వార్త):** ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి భారీగా డబ్బులు తీసుకొని నకిలీ అపాయింట్మెంట్, జాయినింగ్ లెటర్లు ఇచ్చి మోసం చేసిన కేసులో పాతపట్నం పోలీసులు ఒక మహిళను అరెస్టు చేశారు. ఒడిశా రాష్ట్రం గుమ్మ బ్లాకులోని జొల్ల గ్రామానికి చెందిన గంట ప్రదీప్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులకు ఉద్యోగాలు వేయిస్తానని చెప్పి, ఒడిశా రాష్ట్రం ఉప్పలాడ గ్రామానికి చెందిన గుంపు మణి అనే మహిళ (ప్రస్తుతం పాతపట్నం, సహారా వీధి నివాసి) వారి నుండి రూ.4,50,000లు తీసుకుంది. అనంతరం వారికి నకిలీ జాయినింగ్ లెటర్లు ఇచ్చి మోసం చేసింది. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాతపట్నం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తు పోలీసు అధికారి పాతపట్నం ఎస్సై మధుసూదన్ రావు ఆధ్వర్యంలో నిందితురాలు గుంపు మణిని శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు.

## యోగి వేమన వర్సిటీలో అక్రమాలపై చర్యలు తీసుకుంటాం

**కడప, నవంబర్ 21 (వార్త):** కడప కలెక్టరేట్‌లో యోగి వేమన యూనివర్సిటీ, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ, డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీతో పాటు జిల్లాలో ఉన్న ఇతర విశ్వవిద్యాలయాల పనితీరుపై ఆంధ్రప్రదేశ్ శాసనసభ పీయూసీ చైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ప్రవేశాలు, విద్యార్హత ప్రమాణాలు, బోధనా సిబ్బంది నియామకాల్లో పారదర్శకత, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సాంకేతిక పునర్వ్యవస్థీకరణ, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పరిశోధనా కార్యక్రమాల పురోగతి, నిధుల వినియోగం, నిర్వహణ విధానాలపై చర్చించారు. యోగి వేమన యూనివర్సిటీలో జరిగిన అక్రమ నియామకాలపై కమిటీ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ అంశంపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను చైర్మన్ కూన రవి కుమార్ ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించటం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చైర్మన్ తెలిపారు. భవిష్యత్తులో కూడా విశ్వవిద్యాలయాల పనితీరును కఠినంగా పర్యవేక్షిస్తూ, అవసరమైన మార్పులు తీసుకురావడానికి కమిటీ కట్టుబడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పీయూసీ కమిటీ సభ్యులు, ఎమ్మెల్యేలు శ్రావణ్ కుమార్, ఆనందరావు, బేబీ నయన, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, యూనివర్సిటీల అధికారులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546